www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక : 13 శనివారం 10 - 05 - 2025 ఎడిటర్ : పి. జయరాం పేజిలు : 8 వెల : 4

## చందానగర్ లో భారీ అగ్ని ప్రమాదం


3



పాక్ బంకర్లు వీటి ముందు

## ఆగలేవు!

**భారత్ వద్ద నాగ్, ధ్రువాస్త్ర వంటి ఏటీజీఎంలు సిద్ధం**

తొలిఅడుగు, ఇంటర్నెట్ డెస్క్: భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో వివిధ రకాల ఆయుధాల గురించి ప్రజల్లో ఆసక్తి కలుగుతోంది. ఇక భారత్ వద్ద ఉన్న ఆయుధాల్లో... యుద్ధ 2లో..

ఉన్నతాధికారులతో

## రక్షణ మంత్రి కీలక భేటీ


2లో..

తొలిఅడుగు, డెస్క్ : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత్ లక్ష్యంగా డ్రోణులు, క్షిపణులతో పాకిస్థాన్ దాడి చేస్తోంది. ఈ దాడులను భారత్ ఎప్పటికప్పుడు తిప్పికోడుతోంది. అలాంటి వేళ.. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన శుక్రవారం



జవాన్లకు

# అండగా..

**– నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు తెలంగాణ ప్రజా ప్రతినిధుల విరాళం.. సీఎం నిర్ణయం!**

**– పాకిస్థాన్,పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపై దాడుల నేపథ్యంలో సాయుధ బలగాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రజలంతా సైన్యానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.** 2





ఏటీఎం, డిజిటల్

## సేవలు యథాతథం

తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత్–పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, దేశంలో ఏటీఎంలు మూతపడతాయంటూ సామాజిక మాధ్య మాల్లో కొన్ని తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చా యి. అయితే, ఈ వార్తలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) సహా దేశంలోని అగ్రశ్రేణి 2లో..

ఇండియాలో వాటిని

## టార్గెట్ చేశాం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : మే 8, 9 తేదీల మధ్య రాత్రి జరిగిన ఘర్షణల సమయంలో భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అంగీకరించారు. భారత భూభాగంపై పాకిస్తాన్ చేసిన వరుస క్షిప ణి, డ్రోన్ దాడుల తర్వాత ఈ ప్రకటన 2లో..




## తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్

తొలిఅడుగు, హైదరాబాద్ : దేశంలో ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇది 24 గంటలు పని చేస్తుందని, ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించాలని ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ల్యాండ్‌లైన్:011-23380556.. వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ, లైజన్ హెడ్: 2

## 400 డ్రోన్‌లతో పాకిస్థాన్ దాడి

- ☐ పౌర విమానాలను రక్షణ కవచంగా వాడుకుంది: విక్రమ్ మిస్రీ
- ☐ భారత్‌లోని 36 సరిహద్దు ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్ల దాడి
- ☐ 300-400 డ్రోన్లతో గురువారం రాత్రి దాడులకు పాల్పడిన పాక్


2లో..

తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ గురువారం రాత్రి భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది. 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు




## పాకిస్థాన్ సైబర్ అటాక్

**– వాట్సాప్ కు ఈ మెసేజ్ లు వస్తే ఓపెన్ చేయకండి!**

తొలిఅడుగు, డెస్క్ : భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ సైబర్ నేరగాళ్లు మరోసారి అటాక్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' అనే పేరుతో ఒక ప్రమాదకరమైన మాల్‌వేర్‌ను వ్యాప్తి లోకి తెచ్చి, దేశ ప్రజల వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు తదితర సున్నితమైన డేటాను తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని భారత సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2లో..

# స్టేడియం పేల్చేస్తాం

**పాక్ స్లీపర్ సెల్స్ ద్వారా దాడులు చేస్తామని హెచ్చరిక.. స్టేడియంలో తనిఖీలు**

తొలిఅడుగు, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత అరుణ్ జైట్లీ స్టేడియంకు బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి శుక్రవారం ఉదయం ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)కు ఈ మేరకు ఒక ఈ–మెయిల్ అందింది. దాడులకు పాల్పడతామని, ఇందుకోసం భారత్ వ్యాప్తంగా పాకిస్థాన్‌కు విధేయులైన స్లీపర్ సెల్స్ సిద్ధంగా


2లో..

## అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్

తొలిఅడుగు, హైదరాబాద్ : రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్నిరంగాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దీనికోసం ఐదేళ్ల కాలానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేయాలని అధశికారులకు సూచించారు. శు క్రవారం ఐదేళ్ల విద్యుత్ ప్రణాళికపై ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంతర్జాతీయ టెక్నాలజీ, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు పెట్టుబడులతో తమ కార్యకలాపాలు


2

# ఏటీఎం, డిజిటల్ సేవలు యథాతథం



మొదటిపేజీ తరువాయి

బ్యాంకులు తీవ్రంగా ఖండించాయి. తమ ఏటీఎంలతో పాటు అన్ని డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో, సజావుగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశాయి. ఎస్‌బీఐ తమ అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా, "మా అన్ని ఏటీఎంలు, క్యాష్ డిపాజిట్ మెషీన్లు మరియు డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ప్రజల వినియోగానికి అందుబాటులో ఉన్నాయని" పేర్కొంది. ధృవీకరించని సమాచారంపై ఆధారపడవద్దని వినియోగదారులకు విజ్ఞప్తి చేసింది. పీఎన్‌బీ కూడా తమ సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, డిజిటల్ సేవలు సజావుగా పనిచేస్తున్నాయని తెలిపింది. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ఇతర బ్యాంకులు కూడా ఇదే విధమైన హామీ ఇచ్చాయి. మరోవైపు, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తోసిపుచ్చింది. దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా మార్గాలు సజావుగా పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. అనవసరంగా కొనుగోళ్లు చేయవద్దని, ఇంధనం, ఎల్‌పీజీ అన్ని అవుట్‌లెట్లలో సులభంగా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా, దేశంలో ఆహార ధాన్యాలు లేదా ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) భరోసా ఇచ్చింది. అన్ని వస్తువులు మార్కెట్లలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం వద్ద కూడా తగినన్ని నిల్వలు ఉన్నాయని పేర్కొంది. సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ, వ్యాపారులు దేశ సరఫరా వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూస్తారని హామీ ఇచ్చారు.

## పాక్ బంకర్లు వీటి ముందు ఆగలేవు!

ట్యాంకులు, శత్రు స్థావరాలు, బంకర్లను లక్ష్యంగా చేసుకుని యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైళ్లు (ఏటీజీఎం) ముఖ్యమైనవి. ఈ అత్యాధునిక అస్త్రాలు భారత సైనిక పాటవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (ఏటీజీఎం) ప్రధానంగా శత్రువుల యుద్ధ ట్యాంకులు, పటిష్టమైన కవచాలు కలిగిన సైనిక వాహనాలు, బంకర్లను ధ్వంసం చేయడానికి రూపొందించిన శక్తివంతమైన క్షిపణి. దీనిని ప్రయోగించిన తర్వాత, అది స్వయంచాలకంగా లక్ష్యాన్ని గుర్తించి, అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తుంది. సైనికులు భుజంపై నుంచి, ట్రైపాడ్‌పై అమర్చి లేదా వాహనాలపై నుంచి కూడా దీనిని ప్రయోగించవచ్చు. సురక్షిత దూరం నుంచే శత్రు స్థావరాలను నిర్వీర్యం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. చాలా ఏటీజీఎంలలో 'షేప్డ్ ఛార్జ్' సాంకేతికత ఉంటుంది. ఇది పేలుడు శక్తిని ఒకే బిందువుపై కేంద్రీకరించి, ఎంతటి మందపాటి కవచాన్నైనా చీల్చుకుపోయేలా చేస్తుంది. కొన్ని క్షిపణులలో 'ట్యాండమ్ వార్‌హెడ్' వ్యవస్థ ఉంటుంది. ఇది రెండు దశల్లో పేలి, రక్షణ కవచాలను ఛేదించి అసలు లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. భారత సైన్యం వద్ద దేశీయంగా అభివృద్ధి చేసిన 'నాగ్' (భూమి పైనుంచి ప్రయోగించేది), 'ధ్రువాస్త్ర' (గతంలో హెలీనా – హెలికాప్టర్ నుంచి ప్రయోగించేది) వంటి అత్యాధునిక ఏటీజీఎంలు సిద్ధంగా ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా, అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ ఇవి లక్ష్యాలను ఛేదించగలవు.

## ఉన్నతాధికారులతో రక్షణ మంత్రి కీలక భేటీ

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీలో కీలక భేటీ జరిగింది. ఈ భేటీకి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర దివ్వేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ హాజరయ్యారు. ఈ సమావేశంలో దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో 26 మంది మరణించారు. ఈ దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందంనేందుకు కీలక సాక్ష్యాలను భారత్ సంపాదించింది. వాటిని ప్రపంచ దేశాల ముందు ఉంచిది. అలాగే పాకిస్థాన్‌పై భారత్ కీలక ఆంక్షలు విధించింది. ఆ క్రమంలో మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థలను నేలమట్టం చేశారు భారత్ సైనికులు. ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రవాదులు మరణించినట్లు తెలుస్తోంది.

అందుకు ప్రతిగా పాకిస్థాన్ సైతం మే 8వ తేదీన ఇరుదేశాల సరిహద్దు వెంట ఉన్న నగరాలు.. జమ్మూ, పఠాన్‌కోట్, ఉదంపూర్ తదితర ప్రాంతాలపైకి ద్రోణులు, క్షిపణులతో దాడులకు దిగింది. వీటిని భారత్ తిప్పికొట్టింది. దేశ సార్వభౌమత్వాన్ని, దేశ ప్రజలను కాపాడడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# ఇండియాలో వాటిని టార్గెట్ చేశాం

మొదటిపేజీ తరువాయి

చేశారు. ఆకాశ్ ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణితో సహా భారతదేశ వైమానిక రక్షణ వ్యవస్థలు వీటిని అడ్డుకున్నాయి. గురువారం రాత్రి నియంత్రణ రేఖ(ఎల్‌ఓసి), అంతర్జాతీయ సరిహద్దులు (ఐబి) వెంబడి పెద్ద ఎత్తున కౌంటర్-డ్రోన్ ఆపరేషన్ సందర్భంగా భారత సైన్యం 50కి పైగా పాకిస్తానీ డ్రోన్‌లను కూల్చివేసినట్లు సమాచారం. వివిధ ప్రదేశాలలో భారత భూభాగంలోకి బహుళ స్వార్మ్ డ్రోన్‌లను పంపడానికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలు విఫలమైన తర్వాత ఈ ఆపరేషన్ ప్రారంభించింది. భారత ఆర్మీ వైమానిక రక్షణ విభాగాలు వేగంగా స్పందించి ఉధంపూర్, సాంబా, జమ్మూ, అఖ్నూర్, నగ్రోటా, పఠాన్‌కోట్ వంటి ప్రాంతాలలో డ్రోన్‌లను లక్ష్యంగా చేసుకున్నాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్ ఉపరితలం నుండి గగనతల క్షిపణి వాయు రక్షణ వ్యవస్థ గురువారం భారత ఆస్తులను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ డ్రోన్ దాడులను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిందని అధికారులు తెలిపారు. మే 8, 9 తేదీల మధ్య రాత్రి భారత సైన్యం జమ్మూ కశ్మీర్‌లోని పశ్చిమ సరిహద్దు, నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి పాకిస్తాన్ చేసిన బహుళ డ్రోన్ దాడులను విజయవంతంగా తిప్పికొట్టి, ప్రతిస్పందించింది. భారత సైన్యం, వైమానిక దళం రెండూ పాకిస్తాన్ సరిహద్దులో క్షిపణి వ్యవస్థను మోహరించాయని అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 1:05 నుండి 1:30 గంటల మధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సమన్వయంతో పాకిస్తాన్‌లోని జెఎం, ఎల్‌ఇటి స్థావరాలు, పిఓకె వంటి కీలక భవనాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22న 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన కొన్ని రోజుల తర్వాత భారత్ ఈ సైనిక చర్యకు దిగింది. కేవలం ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది కానీ, పాక్ సామాన్య పౌరులకు, సైనికులకు ఎలాంటి నష్టం చేయలేదు. అయినా పాకిస్థాన్ సరిహద్దు వెంబడి భారత పౌరులపై కాల్పులకు తెగబడింది.

## స్టేడియం పేల్చేస్తాం

ఉన్నాయని హెచ్చరించినట్లు సమాచారం. ఈ స్టేడియం ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు హోం గ్రౌండ్‌గా ఉండగా, మే 11న ఇక్కడ ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే, టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు బీసీసీఐ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ బెదిరింపు ఈ-మెయిల్ అందిన విషయాన్ని డీడీసీఏ ఉన్నతాధికారి ఒకరు ధృవీకరించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా డాట్ కామ్‌తో మాట్లాడుతూ, "అవును, ఈ ఉదయం మాకు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దానిని వెంటనే ఢిల్లీ పోలీసులకు పంపాము. వారు ఇప్పటికే రంగంలోకి దిగి, స్టేడియాన్ని తనిఖీ చేశారు" అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ పోలీసులు స్టేడియం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసి, బెదిరింపు ఈ-మెయిల్ మూలాలపై దర్యాప్తు చేస్తున్నారు. భద్రతా వర్గాలు అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతున్నాయి.

## 400 డ్రోన్‌లతో పాకిస్థాన్ దాడి

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు. గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు. పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుంది

# పాకిస్థాన్ సైబర్ అటాక్

మొదటిపేజీ తరువాయి

ఈ వైరస్‌ను చొప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసు విభాగం సూచించింది. పాకిస్థానీ హ్యాకర్లు భారతీయ సోషల్ మీడియా యూజర్లపై ప్రభావం చూపేందుకు, వారి నుంచి కీలక సమాచారాన్ని సేకరించేందుకు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' మాల్‌వేర్‌ను ప్రయోగిస్తున్నట్లు సమాచారం. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్ సందేశాలు, లింకుల ద్వారా ఈ మాల్‌వేర్‌ను ఫోన్లలోకి చొప్పించి, సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. వాట్సాప్‌తో పాటు ఫేస్‌బుక్, ఈమెయిల్స్ ద్వారా కూడా ఈ వైరస్‌ను వ్యాపింపజేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' మాల్‌వేర్ ఫోన్‌లోకి ప్రవేశిస్తే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిం చవచ్చని వారు హెచ్చరించారు. ఫోన్‌లోని రహస్య ఫైళ్లను యాక్సెస్ చేసి, వాటిని లీక్ చేసే ప్రమాదం ఉందని చెప్పారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వేగాన్ని తగ్గించడం లేదా పూర్తిగా క్రాష్ చేయడం చేయవచ్చని తెలిపారు. మన పరికరాలను రిమోట్‌గా వారి ఆధీనంలోకి తీసుకుని దుర్వినియోగం చేయవచ్చని హెచ్చరించారు.

# జవాన్లకు అండగా..

తొలిఅడుగు, హైదరాబాద్ : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో నేషనల్ డిఫెన్స్ ఫండ్ కు తెలంగాణ ప్రజా ప్రతినిధులు తమ నెల జీతాన్ని విరాళంగా అందించాలని నిర్ణయించారు.పాక్ ముష్కరులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి అండగా నిలిచేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నెలజీతాన్ని విరాళంగా అందించాలని సీఎం రేవంత్ సూచించారు. దీనిపై ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలతో చర్చించి విరాళం ప్రకటించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బాధ్యతను అప్పగించారు.దీనిపై సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించ నున్నారు.ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు.దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సరిహద్దు రాష్ట్రాల్లోని తెలంగాణ వాసుల కోసం తెలంగాణ భవన్‌లో ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ తెలిపారు.అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, సరిహద్దు రాష్ట్రాల్లో ప్రస్తుతం నివసిస్తున్న,చిక్కుకున్న తెలంగాణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను అందించే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కంట్రోల్ రూంలో నిరంతరాయంగా సేవలు అందిస్తామని అధికారులు చెప్పారు.



## అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్

మొదటిపేజీ తరువాయి

విస్తరిస్తున్నాయని, దీనివల్ల అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ నెలకొంటుందన్నారు. మరోవైపు.. ముందుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను ఎంపిక చేసి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రుణ మంజూరు పత్రాల అందజేతకు తగిన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కాగా, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 21 వరకు కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని డిప్యూటీ సీఎంను దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్రావు ఆహ్వానించారు.

## తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్

9871999044.. హైదర్ అలీ నఖ్వీ, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు: 9971387500.. జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్: 9643723157.. సి. హెచ్.చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్: 9949351270.




మొదటిపేజీ తరువాయి

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# చందానగర్ లో భారీ అగ్ని ప్రమాదం

- తప్పిన పెద్ద ముప్పు..!
- అగ్నికి అహుతి అయిన ఆర్కే కలెక్షన్ షోరూం
- పది ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలార్పిన సిబ్బంది
- గంటల తరబడి శ్రమించి అదుపులోకి
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు




చందానగర్ / తొలిఅడుగు : చందానగర్ లో జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ఒకేసారి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం సాయంత్రం చందానగర్ మెయిన్ రోడ్డులోని సెంట్రో షోరూంలో ఈ ప్రమాదం సంబవించి క్రమంగా పక్కకకు వేగంగా వ్యాపించింది. అయితే గతంలోనే ఇదే బిల్డింగ్ లో ఇటువంటి అగ్ని ప్రమాదం సంబవించింది. కాగా సెంట్రోషోరూం సిబ్బంది అప్రమత్తమై సిబ్బంది బయటకు పరుగులు తీయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే అందులో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్గదమైంది. అయితే రద్దీగా ఉండే ప్రాంతం కావడం.. పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండే ఏరియా కావడంతో మంటలు పక్కకు వ్యాపించాయి. పక్కనే ఉన్న వూమ్బ్ ఆస్పత్రిలోకి మంటలు వ్యాపించాయి.

ఓ వైపు రాత్రి కమ్ముకుంటున్న సమయంలో వివిధ కార్యాలయాల్లో పనిచేసే వారు ఇళ్లకు వెళ్లెందుకు బయటకు రావడంతో రోడ్డంతా మరింత రద్దీగా మారింది. అప్పటికే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారు రావడానికి ఆలస్యమైంది. దీంతో మంటలు మరింత వేగంగా పక్క షాపులు అయిన వస్త్ర దుకాణాల్లోకి వ్యాపించాయి. దీంతో ఆర్ కె కలెక్షన్ షోరూంలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఆర్ కె కలెక్షన్ పక్కనే ఉన్న వూంబ్ ఫెర్టిలిటీ ఆస్పత్రిలోకి స్వల్పంగా మంటలు వ్యాపించగా ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

అప్పటికే అప్రమత్తమైన అందులోని సిబ్బంది, రోగులను బయటకు తీసుకువచ్చారు. ఈ మంటల్లో ఆస్పత్రి ఏసీలు కొద్దిమేర దగ్ధ అయ్యాయి. అయితే ప్రమాదం జరుగుతున్న సమయంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వూంబ్ ఫెర్టిలిటీ ఆస్పత్రిలోని ఫైర్ సేఫ్టీ పైప్ లను ఆన్ చేసేందుకు యత్నించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఫైర్ సేఫ్టీ పైప్ లు నామమాత్రంగానే పెట్టారని, వాటివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఫైర్ సేఫ్టీ సిబ్బంది తీవ్రంగా మండిపడ్డారు. అలాగే మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వచ్చిన వాహనాల్లోనూ నీరు అయిపోవడంతో జలమండలి ట్యాంకర్లను తీసుకువచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. అనంతరం బాహుబలి ఫైర్ ఇంజన్ ను తీసుకువచ్చి సుమారు 10 ఫైర్ ఇంజన్ల సహాయంతో గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. చందానగర్ మెయిన్ రోడ్డులో అగ్నిప్రమాదం జరగడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఫైర్ సేఫ్టీ వాహనాలు వచ్చేందుకు కూడా ఇబ్బంది ఏర్పడింది. జనాలు భారీగా గుమిగూడడంతో పోలీసులు లాఠీచార్జి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# అక్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన దీక్షలు

- టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం
- దీక్షా శిబిరాన్ని సందర్శించిన వాల హరీష్ రావు




మియాపూర్ / తొలిఅడుగు : జనప్రియ అపార్ట్మెంట్ 5కు సంబందించి టౌన్ ప్లానింగ్ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వహించారని దీంతో వారు ఇచ్చిన అనుమతితో అక్రమ నిర్మాణం చేపట్టడాన్ని నిరసిస్తూ.. జనప్రియ అపార్ట్మెంట్ కు చెందిన 650 కుటుంబాలు నిరసన దీక్షలు ప్రారంభించారు. జనప్రియ అపార్ట్మెంట్ ఫెస్ 5కు చెందిన స్థలాన్ని అలాగే జనప్రియ అపార్ట్మెంట్ సెట్ బ్యాక్ ను రోడ్డుగా చూపించి భవన నిర్మాణం కోసం అక్రమంగా అనుమతులు పొందారు. ఈ విషయంలో జనప్రియ అపార్ట్మెంట్ వారు అనేక సార్లు జీహెచ్ఎంసీ అధికారులకు, టౌన్ ప్లానింగ్ వారికి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోగా వారికి ఆక్యూపేషన్ సర్టిఫికేట్ సైతం అందజేశారు. జనప్రియ అపార్ట్మెంట్ వారి వినతులను పట్టించుకోకుండా అక్రమార్కులకు టౌన్ ప్లానింగ్ అధికారులు అండగా నిలిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శుక్రవారం నిరసన దీక్షకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ హాఫీజ్ పేట్ డివిజన్ గౌరవ అధ్యక్షుడు వాల హరీష్ రావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అక్రమ భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు జనప్రియ అపార్ట్మెంట్ వారికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని తెలిపారు. ఈయన వెంట బాబుమోహన్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

# నిరంతర పోరాట స్ఫూర్తి కామ్రేడ్ బి.యన్

- యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ వనం సుధాకర్

హైదరాబాద్ / తొలిఅడుగు : వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంటు సభ్యులు,యంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు, అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి(బి. యన్) 17వ వర్ధంతి కార్యక్రమం హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని ఓంకార్ భవన్ లో యంసిపిఐ(యు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటి సభ్యులు తుడుం అనిల్ కుమార్ అధ్యక్ష తన నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ ముందుగా బి.యన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం పాలన ను ఎదురొడ్డి తుపాకీ చేతపట్టి పోరాడిన విప్లవ యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి అని అన్నారు. నాటి తెలంగాణ పల్లెల్లో భూస్వాముల చెంతన ఉన్న భూములను పేదలకు పంచడానికి దున్నేవానికి భూమి కావాలని మొదటిసారిగా నినాదం ఇచ్చిన వీరుడు బి.ఎన్ అని కొనియాడారు. 1946 నుండి 1951 వరకు జరిగిన మహోత్తర పోరాటం వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ఆరంభం నుండి ఆసంతం వరకు ఆయుధం చేతపట్టి అలుపెరుగని పోరాటం చేశారని, భూస్వాముల దొరల ఆగడాలను అడ్డుకట్ట వేసి వెట్టి చాకిరిని నిర్మూలిస్తూనే పది లక్షల సాగు భూమిని ప్రజలకు పంచి 4 వేల గ్రామాలను ప్రజా పాలన గావించిన ఘనత కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డిదని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో నేడు కుల మత అసమాన తల గల భారత సమాజాన్ని చక్కదిద్దడానికి పదునైన పోరాటాలు జరగవలసిన అవసరం ఉందని అన్నారు. కామ్రేడ్ బి ఎన్ ఆశించిన సామాజిక న్యాయం బహుజన ప్రజానీకానికి అందవలసి ఉందని అన్నారు. పాలకవర్గాలు గత 75 సంవత్సరాలుగా ధరల భారాలను మోపుతూ ఉచిత పథకాల పేరుతో ప్రజలను మోసగిస్తున్నారని, అవినీతి కార్పోరేట్ ఆర్థిక దోపిడి పెరిగిపోయిందని వీటికి వ్యతిరేకంగా కామ్రేడ్ బి.యన్ పోరాటస్ఫూర్తితో మరిన్ని ప్రజా పోరాటాలు బలోపేతం చేయాలని అప్పుడే కామ్రేడ్ బి.యన్ కి మనం అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. ఇంకా రాష్ట కమిటి సభ్యులు జి. మల్లేశ్,తుడుం అనిల్ కుమార్,ఏ పుష్ప,పల్లె మురళి, ఇ.దశరథ్ నాయక్, యాదగిరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి, పి.భాగ్యమ్మ, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు వై రాంబాబు, కిష్టయ్య, సభ్యులు టి.పుష్పలత, జి.సునీత, లలిత, పార్వతి, రాజు, నరసింహ, శ్రీకాంత్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.




# అనుమతులు లేని కాలేజీలను రద్దు చేయాలి.

- అక్రమంగా సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎఫ్ డీఎస్ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో డీఐఈవోకు వినతి



రంగారెడ్డి / తొలిఅడుగు : అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కళాశాలలను రద్దు చేయాలని అలాగే సమ్మర్ క్లాసుల పేరిట విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్ డీఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఐఈవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ ముత్తెన్న గారి శ్రీకాంత్ మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శేర్లింగంపల్లి మండల పరిధిలో మాదాపూర్, మియాపూర్, కొండాపూర్ ప్రాంతాలలో ఎలాంటి అనుమతులు లేకుండా నారాయణ, శ్రీ చైతన్య, రిసోనన్స్, ఏలెన్, ఫిజిక్స్ వాలా, అనకాడమీ, ఆకాష్, మాద్యులెస్, వశిష్ఠ కళాశాల యాజమాన్యాలు అనేక క్యాంపస్ లు పెట్టి పరీక్షలు పూర్తయ్యాక నాలుగు రోజులు కూడా కనీసం విద్యార్థులకు సెలవులు ఇవ్వలేదన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులను ఇన్కమింగ్ మొదటి సంవత్సరం, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులను ఇన్కమింగ్ సెకండ్ ఇయర్ విద్యార్థులను నిర్బంధించి సమ్మర్ క్లాసెస్ పెట్టి విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. చాలా మంది విద్యార్థులు తల్లితండ్రులకు చెప్పుకోలేక యాజమాన్యం ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థి నాయకులకు తమ సోషల్ మీడియా ద్వారా విద్యార్థి నాయకులకు తమ బాధ వెల్లబుచుకొని రోదిస్తున్నారని తెలిపారు.ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి మాట్లాడుతూ విద్యార్థుల పిల్లల హక్కులను కాల రాస్తున్న ఆయా ప్రాంతాలలో అక్రమంగా కాలేజీ నిర్వహిస్తూ సమ్మర్ క్లాస్ ల ద్వారా విద్యార్థులను వేధిస్తున్న యజమాన్యాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కాలేజీలను రద్దుచేసి యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

# రాశి ఫలితాలు



**మేషం :** వృత్తి వ్యాపారాలలో కొద్దిపాటి చికాకులు ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ఆశించిన రీతిలో రాబడి ఉండదు. బంధు మిత్రులతో ఆకస్మిక వివాదాలు కలుగుతాయి. ఆర్థికంగా ఇబ్బందులు తప్పవు. ఉద్యోగ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటాయి.

**వృషభం :** సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. వ్యాపారాలు విస్తరించి నూతన లాభాలు అందుకుంటారు. ఇంటా బయట నూతన విషయాలు తెలుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగ విషయంలో శు భవార్తలు అందుతాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

**మిధునం :** చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. ఉద్యోగార్థులకు ఆశించిన ఫలితాలు పొందుతారు.

**కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ఉద్యోగమున అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి.

**సింహం :** దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులలో అవాంతరాలు కలుగుతాయి. నూతన రుణ యత్నాలు చేస్తారు. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. ధన ఇబ్బందులుంటాయి.

**కన్య :** పాత మిత్రులను కలుసుకుని కీలక విషయాలు చర్చిస్తారు. బంధుమిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనుల్లో పరిస్థితి కలుగుతుంది. వ్యాపార ఉద్యోగ అంత సంతృప్తికరంగా సాగుతాయి. ఆదాయం మరింతగా పెరుగుతుంది.

**తుల :** ముఖ్యమైన పనులలో ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది. భూ కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు. వృత్తి వ్యాపారములు పరిస్థితి మరింత అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

**వృశ్చికం :** ఇంటా బయట సమస్యలు మరింత పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన కార్యక్రమాలలో అవరోధాలు కలుగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది.

**ధనస్సు :** ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బంధువులుతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులలో స్థిరత్వం లేని ఆలోచనలు చేయడం వలన మానసిక అశాంతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు తప్పవు. విద్యార్థులకు నిరుద్యోగులకు అధిక కష్టం మీద స్వల్ప ఫలితం పొందుతారు.

**మకరం :** గృహమున శుభకార్య వాతావరణం ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగు పడుతుంది. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. భూ సంబంధిత వివాదాలు కలుగుతాయి. భూ సంబంధిత క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

**కుంభం :** చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం కలుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో చికాకులు తప్పవు.

**మీనం :** సమాజంలో పేరు కలిగిన వారితో పరిచయాలు భవిష్యత్తు ఉపయోగపడతాయి. సోదరులతో వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. గృహంలో శుభకార్యాలు పరమైన ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో విజయం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఒత్తిడిని అధిగమించి లాభాల అందుకుంటారు.

# మే 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**– మణుగూరు మండలం సదస్సు సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్**




తొలిఅడుగు, మణుగూరు, మే 09 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం మే 20 తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మణుగూరు మండలం సీఐటీయు సదస్సు అధ్యక్షతన ఉప్పతల నరసింహారావు నిర్వహించడం జరిగింది దీనికీ ముఖ్య అతిథి సీఐటీయు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి మే 20 నా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న సీఐటీయు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం నిసిగ్గుగా ప్రజా వ్యతిరేకమైన విధానాలను అవలంబిస్తున్నది ప్రజలను మతముసుగులో ముంచి ప్రజలపై అధిక బారాలు మోపుతున్నదని విమర్శించారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాచి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడలను తీసుకొచ్చిందని వెంటనే లేబర్ కోడులను విరమించుకోవాలని లేనిచో ప్రభుత్వము ప్రజా అగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా వ్యవసాయం ఈరోజు దేశంలో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని నేడు యువత నష్టాల్లో ఉన్న వ్యవసాయం చేయడానికి ముందుకు రావడంలేదని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర చట్టం పార్లమెంట్లో చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామీణ పేదలను ఎంతో కొంత ఆదుకుంటున్నా ఉపాధి హామీ చట్టానికి రోజురోజుకు నిధులు కోత పెడుతూ పని దినాలు తగ్గిస్తున్నదని దీనివలన గ్రామీణ పేదల ఆదాయాలలో కోతపడుతుందని అన్నారు. అందువలన ఈ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేస్తున్న మే 20 సార్వత్రిక సమ్మెను పారిశ్రామిక కార్మికులు అసంఘటిత కార్మికులు రైతాంగము వ్యవసాయ కూలీలు సమస్త పేద ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్ర పల్లి సాంబశివరావు. రంగా మిడ్ డే మిల్స్ నాయకురాలు శైలజ. పద్మ అరుణ.మున్సిపాలిటీ నాయకులు సురేష్, హేమంతరావు. పాయం సూరయ్య, కారం రమణ, కారం నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఒక న్యాయం పెద్దలకు ఒక న్యాయమా?




**– ఫాతిమా కాలేజీపై చర్యలేవి? – బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**

తొలిఅడుగు, ధర్మపురి మే09 : పెగడపెల్లి:హైదరాబాద్ లోని సల్కం చెరువులో 40% ఆక్రమించి అక్రమంగా నిర్మించిన ఒవైసీ కి చెందిన ఫాతిమా మహిళా కాలేజీని ఎందుకు కూల్చడం లేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ ప్రశ్నించారు. పెగడపెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైడ్రా పేరిట నిరుపేదలకు ఇళ్లను కూల్చి నిలువ నీడ లేకుండా చేసిన ప్రభుత్వం ఫాతిమా కాలేజీ విషయంలో ఎందుకు స్పందించడం లేదని పరీక్షలు అయిపోయి దాదాపు యాభై రోజులు కావస్తున్న ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదన్నారు బిజెపి నాయకులు ఇట్టి విషయాన్ని గుర్తు చేస్తే ఒవైసీ భజన చేయానిదే బిజెపి వాళ్లకు పొద్దు గడవదు అని కాంగ్రెస్ నాయకులు వెటకారంగ మాట్లాడడం చూస్తే కాంగ్రెస్ అంటేనే ముస్లింల పార్టీ అని మరోసారి రుజువయిందని అన్నారు. మల్లి నెల రోజులైతే విద్యాసంస్థలు పునఃప్రారంభం అవుతాయని మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారని హైదరాబాద్ లోని పేదలకు ఒక న్యాయం పెద్దలకు ఒక న్యాయం తగదని వెంటనే ప్రభుత్వం స్పందించి ఒవైసీకి చెందిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై కాంగ్రెస్ పెద్దలు ఎందుకు మాట్లాడడం లేదని ఒవైసీ సోదరులు,ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి ఏమైనా మేనల్లుళ్ళు అవుతారా ఏంటి అని ఘాటుగా ప్రశ్నించారు. ఈసమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి మండల నాయకులు కోట మల్లేశం, తోడేటి గట్టయ్య, తడగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

# సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంటిపై ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా ఏపీ పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించిన - జనగామ జర్నలిస్టులు




తొలిఅడుగు, జనగామ, మే 09 : శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జనగామ జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా నిరసన కార్యక్రమాన్ని తెలియజేశాయి. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా ధనుంజయ రెడ్డి నివాసానికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేసి నాటికి ఏపీ పోలీసుల తీరును ప్రతీ ఒక్క జర్నలిస్టు తీవ్రంగా ఖండించారు.

ఏపీ ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే తెలుగు రాష్ట్రలవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. వాస్తవాలను వెలికి తీసి పత్రికలలో రాస్తే ఏపీ ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులు పెట్టి వేధించటం మానుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లు ఇర్రి మల్లారెడ్డి, సురిగల బిక్షపతి , శ్రీ భాష్యం శేషాద్రి, హింగే మాధవరావు, భాస్కర్, బిట్ల మధు, బండి శ్రీనివాస్, ఉల్లెంగల మనీ గోవర్ధనం వేణుగోపాల్, కామెడీ ఉపేందర్, చౌదరిపల్లి ఉపేందర్, యూసఫ్, పన్నీరు భానుచందర్, శశిధర్, ఆశిష్ ఉపేందర్, మణికుమార్, బజాజ్, క్రాంతి, హరీష్, వినయ్, శివశంకర్, సాగర్, కిరణ్,నవీన్ ఓంకార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

మరో సామాజిక విప్లవం

చరిత్ర అన్ని వేళలా ఒకేలా ఉండదు, కాలమాన పరిస్థితులకు తగ్గట్లు మారుతూ ఉంటుంది. కారల్ మార్క్ చెప్పినట్లు చరిత్ర అంటే వర్గ పోరాటమే. 19వ శతాబ్దంలో సాంఘిక సంస్కరణ ఉద్యమం, 20 శతాబ్దంలో జాతీయ స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, ప్రస్తుతం 21వ శతాబ్దంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సరియైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనగణనలో కులగణనకై ఉద్యమం. ఇలా ఆయా కాలాల్లో ఆయా ఉద్యమాలు సమాజంపై ప్రభావాన్ని చూపుతూ చరిత్రగా నిలిచిపోయాయి. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. 1931 జనాభా లెక్కల నేపథ్యంలో జనగణనలో కులగణన చేయాలనే ప్రతిపాదన 1951 జనాభా లెక్కల సందర్భంగా ముందుకొచ్చినప్పటికీ కేవలం ఎస్సి, ఎస్టిల జనాభాను మాత్రమే లెక్కించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. మొదటి బిపి కమిషన్ కాక కాళేశ్వర్ కమిషన్ సందర్భంగా, రెండవ బిసి కమిషన్ మండల కమిషన్ సందర్భంగా జనగణనలో కులగణన చర్చకు వచ్చింది. అయినా కేంద్రం ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జనగణనలో కులగణన డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది. జనగణనలో కులగణనకై డిమాండ్ ఎన్నిసార్లు ముందుకొచ్చినా కేంద్రం మాత్రం జనగణనలో కులగణన వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. భాషా ప్రయోక్త రాష్ట్రాల విషయంలో కూడా ఈ రకమైన అభిప్రాయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో భాష ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. 70 సంవత్సరాల భాష ప్రయోక్త రాష్ట్రాల చరిత్రలు దేశాన్ని విచ్ఛిన్నం చేయగల అనైక్యత ఎక్కడా సంభవించలేదని చెప్పవచ్చు.

అంటే ఒక విషయంపై మనలో చాలా కాలంగా గూడుకట్టుకున్న ఆలోచనలు వాస్తవం కాదని తేలిపోయింది. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ వచ్చినప్పుడల్లా తోసిపుచ్చిన చరిత్ర కాంగ్రె పార్టీదే.అయినప్పటికీ 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, కులగణన చేయడం జనగణనలో కులగణనకు మొదటిమెట్టుగా చెప్పవచ్చు. ఎన్డిఎ ప్రభుత్వం జనగణనలో కులగణనను వ్యతిరేకించినప్పటికీ ప్రస్తుతం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం. అయితే ఈ ఘనత మాత్రం దేశవ్యాప్తంగా ఈ వాదాన్ని చర్చకు తెచ్చిన కాంగ్రెస్ పార్టీది, ఆయా రాష్ట్రాల్లో జనగణనలో కులగణనకై డిమాండ్ చేసిన డిఎంకె, ఎస్పి, ఆర్జెడి లాంటి ప్రాంతీయ పార్టీలది. కులగణన చేయడమే కాదు, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదే. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణనకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణనకు వాగ్దానం చేయడం, రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించడం, బిసి సంఘాల ఒత్తిడి నేపథ్యంలో కులగణన జరగడం, విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకై శాసనసభ చట్టం చేస్తూ కేంద్రానికి పంపడం చకచగా జరిగిపోయాయి. 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం బిసి సంఘాలు ఢిల్లీలో 'జంతర్ మంతర్' వద్ద డిమాండ్ చేయడంతో కులగణనపై కేంద్రం ఆలోచనలో మార్పు వచ్చిండోచ్చు. కర్ణాటక, తెలంగాణ తోపాటు బీహార్ లాంటి రాష్ట్రాలు కులగణన పూర్తి చేయడం దేశంలో చాలా రాష్ట్రాల్లో కులగణనకై డిమాండ్లు వినిపించడంతో ఒక్కసారిగా కేంద్రం పునరాలోచనలోపడి ఉండవచ్చు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చివరి ఉపన్యాసంలో మాట్లాడిన మాటలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపి ఉండవచ్చు. 'ఒక వ్యక్తికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా 26 జనవరి 1950 నుంచి మనం రాజకీయ సమానత్వంలోకి అడుగు పెట్టబోతున్నాం. కానీ కొన్ని వందల సంవత్సరాలుగా మన దేశంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు మన సమాజంలో సామాజిక, ఆర్థికంగా సమానత్వం సాధించుటకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. రానున్న ప్రభుత్వాలు ఆ ప్రతిబంధకాలను తొలగిస్తూ సామాజిక, ఆర్థిక సమానత్వానికై ప్రయత్నించాలి. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించనినాడు పీడిత ప్రజలు ఈ రాజ్యాంగ సభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు అని హెచ్చరించారు. ఈ 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ వర్గాలైన బిపి ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం చేకూర లేదనే చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా రాజకీయ సమానత్వం ఉన్నట్లు కనబడిన, ఆర్థిక అసమానతలు, ఓటు హక్కును నిజాయితీగా ఉపయోగించుకోలేని పరిస్థితుల వల్ల అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం గల రాజకీయ సమానత్వం ఇప్పటికీ సాధ్యం కాలేదు. దీనికి తోడు రాత్రికి రాత్రి ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చిన కేంద్రంపై దేశవ్యాప్తంగా బిసిలందరూ అసంతృప్తితో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ తగ్గడం, రానున్న బీహార్, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో జనగణనలో కులగణననే ప్రధాన ప్రచారాంశంగా ఉండడంతో కేంద్రం ఆలోచన మారి ఉండవచ్చు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించాలంటే దేశవ్యాప్తంగా డిమాండ్‌గా వస్తున్న జనగణనలో కులగణన ఒక్కడే పరిష్కార మార్గంగా కేంద్రం భావించి ఉండవచ్చు. జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఇల్లు అలుకగానే పండుగా కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడి సంబరపడిపోకూడదు. రానున్న జనగణనలో కులగణనకై కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్గదర్శకాలను బిసి సమాజం నిశితంగా గమనించాలి. జనగణనలో కులగణన చేస్తే సరిపోదు. కులగణన రిపోర్టు కనుగుణంగా మండల కమిషన్ సూచించిన 40 సిఫారసులను అమలు చేయాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే జనగణనలో కులగణన చేపట్టినదానికి సార్ధకత చేకూరుతుంది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి

తొలిఅడుగు, హుజురాబాద్, మే 09 : జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన పుల్యాల ఓదెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మృతురాలి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి శుక్రవారం రోజున మృతురాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ పుల్యాల ఓదెమ్మ మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబానికి తీరని లోటునన్నారు ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు,పాతకాల అరుణ్ రాచపల్లి రవితేజ పాల్గొన్నారు .



# రేణుకా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న సంతోష్ గుప్తా

తొలిఅడుగు, గజ్వేల్, మే 09 : సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం లో ఇటీవల అత్యంత వేగంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు శుక్రవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సీ సంతోష్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎన్ సీ సంతోష్ వారి మిత్రులను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి, సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపి జ్ఞాపిక అందజేశారు,అనంతరం ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ ... అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని ప్రజ్ఞాపూర్ గౌడ



సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం సుందరంగా నిర్మించడం అభినందనీయమని గౌడ సంఘం సభ్యులను అభినందించారు

# మళ్లీ షాకిచ్చిన బంగారం..

తొలిఅడుగు, భారతీయులకు బంగారం అంటే ఎంతో ఆసక్తి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో పసిడి కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. కానీ ఈ సమయంలోనే సామాన్యులకు షాకిస్తున్నాయి బంగారం ధరలు. కొన్ని రోజులుగా పరుగులు పెడుతూ ఊహించని విధంగా ధరలలో మార్పు చోటు చేసుకుంటుంది. బంగారం ధరలు మళ్లీ షాకిస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం నెమ్మదిగా తగ్గుతూ వచ్చిన పసిడి.. ఇప్పుడు ఊహించని విధంగా పెరిగింది. నిన్న ఒక్క గోల్డ్ రేట్స్ లో మార్పులు జరగ్గా.. ఈరోజు అంటే శుక్రవారం ఉదయం స్వల్పంగా పెరిగాయి. దేశీయ మార్కెట్లో శుక్రవారం ఉదయం 7 గంటల సమయానికి 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ. 99,610కు చేరింది. దీంతో అటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరలలో మార్పులు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లోనూ పసిడి ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్?లో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,610కు చేరింది. అలాగే విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.91,460 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.99,610కు చేరింది.



అలాగే ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రూ.91,310 చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,760కు చేరింది. ఇక బెంగుళూరులో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,610 వద్ద కొనసాగుతుంది. అలాగే చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.91,310కు చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.99,610కు చేరింది.

# మార్కెట్లలో ఉద్రిక్తతల భయాలు

తొలిఅడుగు, భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్లలో ఆందోళన ను రేకిత్తించాయి. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు బదులుగా పాక్ భారత్‌లోని సరిహ ద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు పాల్పడు తోందనే రిపోర్టులు మార్కెట్ల్లలో ప్రతికూలతను పెంచాయి. మరోవైపు భారత సైన్యం దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమై నట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాలు దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడిని పెంచాయి. ముఖ్యంగా చివరి గంటలో అమ్మకాల వెల్లువ చోటు చేసుకోవడంతో గురువారం బిఎస్ ఇ సెన్సెక్స్ 411.97 పాయింట్లు లేదా 0.51 శాతం పతనమై 80,334.81కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 140.60 పాయింట్లు లేదా 0.58 శాతం నష్టంతో 24,273.80 వద్ద ముగిసింది. నిఫ్టీలో మిడ్‌క్యాప్ 100 సూచీ 1.95 శాతం, స్మాల్‌క్యాప్ 1.43 శాతం చొప్పున పతనమ య్యాయి. నిఫ్టీలో ఐటి, మీడియా రంగాలు మిగితా అన్నీ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆటో, ఎనర్జీ, ఎఫ్ఎంసిజి, రియాల్టీ, లోహ, ఫార్మా, ఆయిల్ అండ్‌గ్యాస్ తదితర రంగాలు 1 శాతం పైగా నష్టపోయాయి. సెన్సెక్స్30లో 26 సూచీలు నేల చూపులు చూశాయి. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, కొటాక్ మహీంద్రా బ్యాంక్, టైటన్ షేర్లు స్వల్పంగా పెరిగాయి. ఎటర్నల్ (జొమాటో) 3.97 శాతం, ఎంఅండ్ఎం 3.36 శాతం, బజాజ్ ఫిన్ 2.19 శాతం, మారుతి సుజుకి 2.04 శాతం, టాటా స్టీల్ 2.19 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. భారత వైమానిక దాడుల దెబ్బకు పాకిస్థాన్ మార్కెట్లు కుప్పకూలాయి. బుధవారం సెషన్‌లో నూ భారీ నష్టాలు చవి చూసిన కెఎస్ఇ-30 సూ చీ గురువారం మరో 7.2 శాతం పతనమయ్యిం ది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగాలు విరుచుకుపడ్డాయన్న సమాచారం వ్యాపించడం తో అరగంట పాటు ట్రేడింగ్‌ను నిలిపివేశారు.

# ఏ టైంలో స్నానం చేస్తే మేలు..



తొలిఅడుగు, మంచి ఆరోగ్యానికి స్నానం చాలా అవసరం. స్నానం శరీరాన్ని శుభ్రపరచడమే కాకుండా మనసును కూడా ప్రశాంతపరుస్తుంది. కానీ చాలా మంది ఉదయం స్నానం చేస్తారు. మరి కొంతమంది రాత్రిపూట స్నానం చేస్తారు. భారతీయులుగా మనం ఎక్కువగా ఉదయం స్నానం చేయడానికి ఇష్టపడతాం. ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ స్నానం చేసే అలవాటు ఉంటుంది. మంచి ఆరోగ్యానికి స్నానం చాలా అవసరం. స్నానం శరీరాన్ని శుభ్రపరచడమే కాకుండా మనసును కూడా ప్రశాంతపరుస్తుంది. కానీ చాలా మంది ఉదయం స్నానం చేస్తారు. మరి కొంతమంది రాత్రిపూట స్నానం చేస్తారు. భారతీయులుగా మనం ఎక్కువగా ఉదయం స్నానం చేయడానికి ఇష్టపడతాం. కానీ చైనా, జపాన్, కొరియా వంటి దేశాల్లో రాత్రిపూట స్నానాలు చేసే అలవాటు ఉంది. కానీ ఈ రెండింటిలో ఏది మంచిదో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? సాధారణంగా చాలా మంది సాయంత్రం లేదా రాత్రి పూట స్నానం చేస్తారు. ఇలా చేయడం వల్ల రోజులో శరీరంపై పేరుకుపోయిన టాక్సిన్స్, మురికి పూర్తిగా తొలగిపోతాయి. అలాగే, వారికి రాత్రిపూట విశ్రాంతి అవసరం కాబట్టి, బాగా నిద్రపోవడానికి ఇలా చేస్తారు. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుందని చాలా మంది నమ్ముతారు. ముఖ్యంగా చైనా వంటి దేశం.. తేమతో కూడిన, ఉష్ణమండల ప్రాంతం. కాబట్టి ఇక్కడి ప్రజలకు ఎక్కువగా చెమట పడుతుంది. అందుకే వారు రాత్రిపూట స్నానాలు చేయడానికి ఇష్టపడతారు. రాత్రిపూట స్నానం చేయడం మంచిదని నిపుణులు కూడా చెబుతున్నారు. రోజంతా కష్టపడి పనిచేసిన తర్వాత స్నానం చేయడం వల్ల అలసట తగ్గి బాగా నిద్రపోతుందట. చాలా మంది ఉదయం,రాత్రి స్నానం చేస్తారు. ఆయుర్వేదంలో మాత్రం ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు స్నానం చేయడం ఉత్తమమని చెబుతుంది. అలాగే ఆయుర్వేదం ప్రకారం మధ్యాహ్నం స్నానం చేయడం మంచిది కాదు. మధ్యాహ్నం స్నానం చేయడం వల్ల అనేక వ్యాధులు వస్తాయి. ఇది మయోసైటిస్ అనే వాపుకు సంబంధించిన వ్యాధిని కలిగిస్తుందట. మధ్యాహ్నం స్నానం చేయడం వల్ల వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, కంటి సమస్యలు కూడా వస్తాయని నిపుణులు అంటున్నారు. తిన్న తర్వాత కూడా స్నానం చేయకూడదని నిపుణులు అంటున్నారు. భోజనం తర్వాత, ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి కడుపుకు ఎక్కువ శక్తి, సరైన శరీర ఉష్ణోగ్రత అవసరం. అంతేకాకుండా, ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి తిన్న తర్వాత స్నానం చేయడం మంచిది కాదు. దీనివల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. అందుకే నిపుణులు తిన్న గంట తర్వాత లేదా గంటన్నర తర్వాత మాత్రమే స్నానం చేయాలని అంటున్నారు.

# సాయంత్రం 7 లోపు భోజనం ముగిస్తున్నారా..



తొలిఅడుగు, సాయంత్రం 7 గంటల్లోపు భోజనం చేయడం కేవలం ఆహార అలవాటు మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన జీవనశైలికి దారితీసే శక్తివంతమైన ఆచారం. ఈ సమయంలో భోజనం చేయడం జీర్ణక్రియను మెరుగుపరచడం నుండి గుండె ఆరోగ్యాన్ని కాపాడడం వరకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఆయుర్వేదం, ఆధునిక శాస్త్రీయ అధ్యయనాలు ఈ అలవాటును బలంగా సమర్థిస్తాయి, శరీర గడియారాన్ని సమతుల్యం చేస్తూ, మానసిక, శారీరక శ్రేయస్సును పెంచుతాయి. సాయంత్రం 7 గంటల్లోపు భోజనం చేయడం ఆరోగ్యకరమైన జీవనశైలిలో ముఖ్యమైన అలవాటు. ఈ సమయంలో భోజనం చేయడం వల్ల శరీరం జీర్ణక్రియ, జీవక్రియ, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ ఆచారం ఆయుర్వేదం, ఆధునిక శాస్త్రీయ అధ్యయనాలలో ఎప్పటినుంచో ప్రాచుర్యం పొందింది. సాయంత్రం 7 గంటల్లోపు భోజనం చేయడం జీర్ణక్రియను గణనీయంగా మెరుగుపరుస్తుంది. రాత్రి సమయంలో శరీరం జీవక్రియ రేటు తగ్గుతుంది, జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తి మందగిస్తుంది. ఆలస్యంగా భోజనం చేస్తే, ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది, దీనివల్ల అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముందుగానే భోజనం చేయడం ద్వారా శరీరం ఆహారాన్ని సమర్థవంతంగా జీర్ణం చేస్తుంది, పేగు ఆరోగ్యాన్ని పెంచుతుంది. ఆయుర్వేదం ప్రకారం, సూర్యాస్తమయం తర్వాత రెండు గంటలలోపు భోజనం పూర్తి చేయడం జీర్ణ వ్యవస్థకు అనుకూలం.



సాయంత్రం 7 గంటల్లోపు భోజనం చేయడం బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఆలస్యంగా భోజనం చేస్తే, శరీరం కేలరీలను శక్తిగా మార్చకుండా కొవ్వుగా నిల్వ చేస్తుంది, ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. అధ్యయనాల ప్రకారం, రాత్రి 7 గంటల్లోపు తేలికపాటి భోజనం చేసేవారిలో ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఈ అలవాటు జీవక్రియను సమతుల్యం చేస్తుంది, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. రాత్రి 7 గంటల్లోపు భోజనం చేయడం నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఆలస్యంగా భోజనం చేస్తే, శరీరం జీర్ణక్రియపై దృష్టి పెడుతుంది, దీనివల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వంటి సమస్యలు కూడా రాత్రి నిద్రను భంగపరచవచ్చు. ముందుగానే భోజనం చేయడం ద్వారా శరీరం విశ్రాంతి స్థితిలోకి వెళ్తుంది, గాఢ నిద్రను ప్రోత్సహిస్తుంది. మంచి నిద్ర మానసిక ఆరోగ్యాన్ని, రోజువారీ శక్తిని పెంచుతుంది. సాయంత్రం 7 గంటల్లోపు భోజనం చేయడం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆలస్య భోజనం రక్తంలో షుగర్ స్థాయిలు, ట్రైగ్లిజరైడ్‌లను పెంచుతుంది, ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనాల ప్రకారం, రాత్రి 7 గంటల తర్వాత భోజనం చేసేవారిలో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ముందుగా భోజనం చేయడం రక్తపోటును నియంత్రిస్తుంది, కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

# నాన్ వెజ్ తినని వారికి అద్భుత వరం ఈ పండు..!



తొలిఅడుగు, బంగారు రంగులో సువాసనలు వెదజల్లే పనస తొనలను ఎవరు ఇష్టపడరు చెప్పండి.. నిజానికిది సీజనల్ పండు. అందుకే డిమాండ్ కూడా కొంచెం ఎక్కువే. ఇది రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఈ పండులో పోషకాలు పుష్కలంగా ఉంటాయని, మాంసానికి ప్రత్యామ్నాయంగా తినవచ్చని వైద్యులు సైతం చెబుతున్నారు. పనస పండులో ఆరోగ్యకరమైన పోషకాలు పుష్కలంటా ఉంటాయి. అందుకే వీటిని విరివిగా వినియోగిస్తారు. అనేక రకాల ఆహారాలలో కూడా ఉపయోగిస్తుంటారు. దీని వాసన ఆహార రుచిని రెట్టింపు చేస్తుంది. దీన్ని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం. ఈ పండులో విటమిన్లు, ఖనిజాలు, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఎలక్ట్రోలైట్లు, ఐరన్, పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల ఇది ఇతర పండ్ల కంటే ఎక్కువ పోషకాలను కలిగి ఉంటుంది. పనస పండులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి డయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. పనస పండు పోషకాలతో పాటు పొటాషియం, ఫైబర్‌ను అధికంగా కలిగి ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా సహాయపడుతుంది. పనస పండులో ఫైబర్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. దాని విత్తనాలలోని ఈ సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. పనస పండులో తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. పనసకాయను మితంగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. పనస పండు అధిక రక్తపోటును నియంత్రించడమే కాకుండా, గుండె సంబంధిత ఇతర ఆరోగ్య సమస్యలను కూడా నివారిస్తుంది. ఈ పండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పనస పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, అజీర్ణం, మలబద్ధకం సమస్యలను క్రమంగా తొలగిస్తుంది. ఈ పండులోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు శరీరంలో కనిపించే ఫ్రీ రాడికల్స్‌కు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తాయి. అంతేకాకుండా శరీరంలో క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించడంలోనూ సహాయపడతాయి.

# ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు తాగితే..!



తొలిఅడుగు, చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగాలని పదేపదే చెబుతుంటారు. నిజంగా.. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగడం ఓ మంచి అలవాటు. అందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఈ విషయాన్ని పదేపదే చెబుతుంటారు. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? అవును. ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మన ఆరోగ్యంలో అనేక మార్పులు వస్తాయట. ఆయుర్వేదం నుంచి సైన్స్ వరకు ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరమని చెబుతుంది. ఉదయం పూట నిద్ర లేచిన వెంటనే గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. ఇది పేగు కండరాలను కూడా సడలిస్తుంది. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం పూర్తిగా నిర్విషీకరణ చెందుతుంది. ఈ నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి, శరీరాన్ని లోపలి నుంచి శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. కొంతమంది నిమ్మకాయ, తేనె కలిపి తాగుతారు. ఇది నిర్విషీకరణ ప్రక్రియకు మరింత సహాయపడుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ఉదయం గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. కాబట్టి, కేలరీలు వేగంగా కరుగుతాయి. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుందని వైద్యులు అంటున్నారు. శరీరం చురుగ్గా ఉంటుంది కూడా. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది కండరాలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి మేలు చేస్తుంది. దాని ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. అంతేకాకుండా గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొటిమలు, ముడతలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

# రామ్ చరణ్ క్లాసిక్ సీక్వెల్



తొలిఅడుగు, 35 సంవత్సరాల తర్వాత విడుదలవుతున్న జగదేకవీరుడు అతిలోకసుందరిని ఆస్వాదించడం కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఉన్నారని అడ్వాన్స్ బుకింగ్స్ తేటతెల్లం చేశాయి. 1990 తుఫానులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు తడిసి ముద్దవుతున్న టైంలో ఈ సినిమా సృష్టించిన రికార్డుల గురించి ఎంత చెప్పినా తక్కువే. మూడు దశాబ్దాల తర్వాత కూడా ఇళయరాజా పాటలు చెవుల్లో అమృతం పోస్తున్నా, చిరంజీవి శ్రీదేవి జంటను అలాగే చూస్తూ ఉండాలని అనిపించినా అదంతా దర్శకుడు రాఘవేంద్రరావు మహాత్యమే. అఫోర్డ్స్ నిర్మాత అశ్వినిదత్ సాహసాన్ని ప్రస్తావించకుండా ఉండలేం. అంత గొప్ప క్లాసిక్ వెనుక మహా యజ్ఞమే జరిగింది.అయితే దీనికి ఎప్పటి నుంచో సీక్వెల్ వస్తే బాగుంటుందనే డిమాండ్ బాహుబలి నుంచి ఎక్కువగా వినిపిస్తోంది. దర్శకేంద్రులు సుముఖంగా లేనప్పటికీ అశ్వినీదత్ మాత్రం సిద్ధంగా ఉన్నారు. రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా చేస్తే బాగుంటుందనేది చిరంజీవి వ్యక్తిగత కోరిక. ఇవాళ రిలీజ్ చేసిన ప్రమోషనల్ ఇంటర్వ్యూలో ఒక ఇంటరెస్టింగ్ ట్విస్ట్ బయట పడింది. వీడియో ద్వారా టీమ్‌తో మాట్లాడిన రామ్ చరణ్ జగదేకవీరుడు అతిలోకసుందరిలో ఉంగరం ఏమైంది, చేప ఏమైంది లాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ ని డిమాండ్ చేస్తున్నానని చెప్పడం ఫ్యాన్స్ ని ఆశ్చర్యానికి గురి చేసింది. అంటే తెరవెనుక దీని గురించి చర్చలైతే జరుగుతున్నాయన్న మాట. చరణ్ ప్రత్యేకంగా నాగ్ అశ్విన్ పేరే ప్రస్తావించడానికి కారణం ఆయన్ని డైరెక్ట్ చేయమని అడగటమేగా. నిజంగా రాజు ఇంద్రజలకు సంతానం కలిగి అతను రామ్ చరణ్ అయ్యి, ఇంకో లోకం నుంచి జాన్వీ కపూర్ వస్తే ఆ కలయిక చాలా బాగుంటుంది.

# డ్రాగన్ భామ మీద అవకాశాల వర్షం

తొలిఅడుగు, ఇండస్ట్రీలో అంతే. ఒక్క హిట్ జాతకాలను మార్చేస్తుంది. ఒక్క ఫ్లాప్ ఎక్కడికో కిందకు తీసుకెళు ంది. డ్రాగన్ రూపంలో సూపర్ సక్సెస్ అందుకున్న కయదు లోహర్ మొదటి క్యాటగిరీలోకి వస్తోంది. శ్రీవిష్ణు అల్లూరితో మన ప్రేక్షకులకు పరిచయమైనప్పటికీ డ్రాగన్ వచ్చే దాకా తనలో ఉన్న మేజిక్ జనాలకు అర్థం కాలేదు. కట్ చేస్తే తన డిమాండ్ తెలుగు తమిళ భాషల్లో విపరీతంగా పెరిగిపోయింది. నాని – దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కబోయే ది ప్యారడైజ్ లో తనను తీసుకోవడం పక్కాని ఫిలిం నగర్ టాక్. ఇది చాలా పెద్ద ప్రమోషన్. ఈ ప్యాన్ ఇండియా మూవీ మీదున్న అంచనాల దృష్ట్యా ఇది క్రేజీ ఆఫర్. ఇప్పటికే తను విశ్వక్ సేన్ ఫంకీలో భాగమయ్యింది. అనుదీప్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఎంటర్ టైనర్ షూటింగ్ గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతోంది. అథర్వ – తమన్ నటిస్తున్న సినిమా, శింబు మూవీ, నివిన్ పౌలితో ఒక చిత్రం, జివి ప్రకాష్ కుమార్ తో మరొకటి ఇలా వరసగా తన ఖాతాలో పడ్డాయని చెన్నై రిపోర్ట్. రవితేజ – కిషోర్ తిరుమల కాంబో కోసం తనను సంప్రదించినట్టు లేటెస్ట్ అప్డేట్. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు కానీ దాదాపుగా ఖరారైనట్టే. ఇలా మొత్తం అరడజను పైగా కమిట్ మెంట్లతో ఉన్న కయదు లోహర్ డైరీ చూస్తే ఇంకో రెండేళ్ల దాకా కాల్ షీట్లు దొరకడం అనుమానంగానే ఉంది. అంతేమరి విజయలక్ష్మి తలుపు తడితే కెరీర్ ఇలా మారిపోతుంది. తెలుగు తమిళంకు సమాన ప్రాధాన్యం ఇస్తానంటున్న కయదు లోహర్ రెమ్యునరేషన్ కూడా అంతే భారీగా పెరిగిందట. డ్రాగన్ ముందు వరకు ఛాన్స్ రావడమే ఎక్కువనుకుంటే ఇప్పుడు ఎంత అడిగినా ఇచ్చేందుకు నిర్మాతలు రెడీగా ఉన్నారు.



# కమల్ హాసన్ ముందుచూపు బాగుంది

తొలిఅడుగు, లోకనాయకుడు కమల్ హాసన్ చాలా ప్లాన్డ్ గా ప్రమోషన్ల విషయంలో వ్యవహరిస్తున్న తీరు ఆకట్టుకునేలా ఉంది. వచ్చే నెల జూన్ 5 విడుదల కాబోతున్న తగ్ లైఫ్ కోసం ఇప్పటి నుంచే పబ్లిసిటీ మొదలుపెట్టేశారు. తెలుగు మీడియాని ప్రత్యేకంగా చెన్నై పిలిపించి మరీ ఇంటర్వ్యూలు ఇవ్వడం అందులో భాగమే. నాయకుడు కలయిక జరిగిన ముప్పై ఎనిమిది సంవత్సరాల తర్వాత మణిరత్నంతో కమల్ చేసిన మూవీ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. మరో హీరోగా శింబు నటించడం, ఏఆర్ రెహమాన్ సంగీతం, పెద్ద క్యాస్టింగ్ లాంటి ఆకర్షణలు అంచనాలు పెంచుతున్నాయి. ఏపీ తెలంగాణలో భారీ రిలీజ్ చేయబోతున్నారు.ఇంత జాగ్రత్త వహించడం వెనుక కారణముంది. తగ్ లైఫ్ కి జూన్ 5 ముందు వెనుకా ఏ సినిమాలు పోటీకి వస్తాయో అంతు చిక్కడం లేదు. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు మే 30 లేదా జూన్ 12 ఆప్షన్లు చూస్తోంది. ఏ క్షణమైనా అధికారిక ప్రకటన రావొచ్చు. విజయ్ దేవరకొండ కింగ్ డమ్ వచ్చేది దాదాపు ఖరారు అంటున్నారు కానీ డిస్ట్రిబ్యూటర్ వర్గాల్లో అనుమానాలు లేకపోలేదు. జూన్ 20 కుబేర, సితారే జమీన్ పర్ అటుపై 27 కన్నప్ప వరసగా కాచుకుని ఉన్నాయి. సో మొదటి వారం పది రోజులు తగ్ లైఫ్ కు చాలా కీలకం. ఓపెనింగ్స్ రావాలంటే ఊరికే ఉంటే కుదరదు. అందుకే కమల్ స్వయంగా రంగంలోకి దిగారు. విక్రమ్ బ్లాక్ బస్టర్ సాధించాక కమల్ హాసన్ కు భారతీయుడు 2 రూపంలో షాక్ కొట్టింది. ఆ గాయాన్ని పూర్తిగా మాన్పుతుందనే నమ్మకం తగ్ లైఫ్ ద్వారా వ్యక్తం చేస్తున్నారు. పొన్నియిన్ సెల్వన్ డబ్బింగ్ వెర్షన్లు ఆశించిన స్థాయిలో ఆడనప్పటికీ తగ్ లైఫ్ కి ఎలాంటి ఇబ్బంది లేదని మణిరత్నం భావిస్తున్నారు



# బిగ్ మూవీలో ఐటమ్ సాంగ్?



తొలిఅడుగు, అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ శ్రీలీల చేసిన ఐటమ్ సాంగ్ సినిమాను మరో స్థాయికి తీసుకు వెళ్లింది. అందుకే శ్రీలీల క్రేజ్ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో పెరిగింది. కిస్సిక్ కారణంగానే బాలీవుడ్‌లో సినిమాను చేసే అవకాశంను దక్కించుకుంది. తమిళనాట కూడా ఈ భామ ఒక సినిమాను చేస్తోంది. హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తున్న శ్రీలీల త్వరలోనే తెలుగులో ఒక బిగ్ సినిమాలో ఐటమ్ సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. బుచ్చి బాబు ఈ సినిమా కోసం ఒక స్పెషల్ సాంగ్‌ను ప్లాన్ చేస్తున్నాడట. ఈ పాటను శ్రీలీలతో చేయిస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని నిర్మాతలు చర్చించారని సమాచారం. పుష్ప 2 సినిమాలో శ్రీలీల ఐటమ్ సాంగ్‌తో ఆకట్టుకుంది. దీంతో 'పెద్ది'లో శ్రీలీలను ఐటమ్ సాంగ్ కు ఎంపిక చేస్తే బాగుంటుదని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నారట. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించే ఈ పాట సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందట.

# ప్రీమియర్ షోలకు విశేష స్పందన



తొలిఅడుగు, కథానాయిక సమంత నిర్మాతగా మారుతూ ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, ప్రమోషనల్ సాంగ్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికేట్ ఇచ్చారు. డిఫరెంట్ కామెడీ, హర్రర్ జోనర్‌లో ఈ చిత్రం అద్భుతంగా ఉందని సెన్సార్ బృందం ప్రశంసలు కురిపించింది. ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. వివేక్ సాగర్ ఆకర్షణీయమైన నేపథ్య సంగీతం, క్లింటన్ సెరెజో పాటలు స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. తన అభిరుచికి, ఆకర్షణీయమైన కథ చెప్పడంలో నిబద్ధతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే సమంత ఈ చిత్రంతో నిర్మాణంలోకి ఒక ముఖ్యమైన అడుగు వేసింది. కొత్త వారిని ప్రోత్సహిస్తూ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో కొన్ని చోట్ల పెయిడ్ ప్రీమియర్లు వేసి 'శుభం' మూవీని ప్రత్యేకంగా ప్రదర్శించారు. స్పెషల్ ప్రీమియర్ షోల నుంచి ఈ చిత్రానికి విశేషమైన స్పందన లభించింది అని చిత్ర యూనిట్ తెలిపింది.

# చరిత్ర సృష్టించిన ధోనీ..



తొలిఅడుగు, బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) 2 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్‌కే కెప్టెన్ ఎంఎస్ ధోనీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. నిన్నటి మ్యాచ్‌లో ఎంఎస్‌డీ అజేయంగా 18 పరుగులు చేశారు. తద్వారా ఐపీఎల్ చరిత్రలోనే మరే ఇతర ఆటగాడు సాధించని ప్రత్యేకమైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్ హిస్టరీలో 100 మ్యాచ్‌ల్లో నాటౌట్‌గా నిలిచిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. మహీ ఇప్పటికే అత్యధిక సార్లు నాటౌట్‌గా నిలిచిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉండగా%ౌ% ఇప్పుడు అతను 100 సార్లు నాటౌట్ అనే మైలురాయిని కూడా సాధించాడు. మొత్తం 241 ఇన్నింగ్స్‌లలో ఈ ఫీట్‌ను నమోదు చేశాడు. కాగా, ఈ జాబితాలో ధోనీ తర్వాత రెండో స్థానంలో సీఎస్‌కే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఉన్నాడు. అతను 80 సార్లు నాటౌట్‌గా నిలిచాడు..

# క్వార్టర్స్‌లో ఆయుష్ తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ 2025



తొలిఅడుగు, భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. వరుసగా రెండో విజయం నమోదు చేసిన ఆయుష్ శెట్టి పురుషుల సింగిల్స్‌లో సత్తా చాటాడు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్లో మాజీ వరల్డ్ నం.1, భారత అగ్రశ్రేణి షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌పై మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందాడు. గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో ఆయుష్ శెట్టి 21-16, 15-21, 21-17తో కిదాంబి శ్రీకాంత్‌పై గెలుపొందాడు. తొలి గేమ్‌ను 21-16తో సొంతం చేసుకున్న ఆయుష్.. రెండో గేమ్‌లో కిదాంబికి తలొగ్గాడు. కీలక గేమ్‌లో పైచేయి సాధించిన శ్రీకాంత్ జోరందుకున్నట్టే కనిపించాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో శ్రీకాంత్‌ను చిత్తు చేసిన శెట్టి క్వార్టర్‌ఫైనల్ బెర్త్ కైవసం చేసుకున్నాడు. నేడు సెమీఫైనల్లో చోటు కోసం కెనడా షట్లర్, ఏడో సీడ్ బ్రయాన్ యాంగ్‌తో ఆయుష్ శెట్టి తలపడనున్నాడు. మరో ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో తరుణ్ మానెపల్లి వరుస గేముల్లో నిరాశపరిచాడు. 34 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో 13-21, 9-21తో మహ్మద్ జాకి చేతిలో ఓటమి చెందాడు. మహిళల సింగిల్స్ విభాగంలో అన్‌సీడెడ్ ఉన్నతి హుడా సైతం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. చైనీస్ తైపీ షట్లర్ లిన్ సి యన్‌పై 21-12, 21-7తో ఉన్నతి మెరుపు విజయం సాధించింది. 27 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసిన ఉన్నతి నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్ సమరంలో మరో చైనీస్ తైపీ షట్లర్ హంగ్ యి టింగ్‌తో పోటీపడనుంది. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ, అన్మోల్, రక్షిత శ్రీ రామ్‌రాజ్‌లు తొలి రౌండ్లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. డబుల్స్ విభాగంలో భారత షట్లరు ఎవరూ పోటీపడటం లేదు. సాత్విక్, చిరాగ్ శెట్టి సహా పుల్లెల గాయత్రి, ట్రెసా జాలిలు తైపీ ఓపెన్‌కు దూరంగా ఉన్నారు. సింగిల్స్ స్టార్ షట్లర్లు పి.వి సింధు, లక్ష్యసేన్, హెచ్.ఎస్ ప్రణరు సైతం తైపీ ఓపెన్‌లో పోటీపడటం లేదు.

# ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేయకండి..!



తొలిఅడుగు, భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నకిలీ వీడియోలపై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆందోళన వ్యక్తం చేశాడు. భారత సైన్యం ధైర్యాన్ని ప్రశంసిస్తూ, నకిలీ వార్తలను నమ్మకూడదని, బాధ్యతాయుతంగా ఉండాలని కోరాడు. దేశ రక్షణలో సైన్యం పాత్రను కొనియాడారు. భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్ని విషయం తెలిసిందే. ఒక రకంగా రెండు దేశాల మధ్య అనధికారిక యుద్ధం మొదలైందని నిపుణులు అంటున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేపట్టింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ జమ్మూ కశ్మీర్‌తో పాటు పలు ప్రాంతాలపై దాడికి యత్నించింది. కానీ, వాటిని భారత్ తప్పికొట్టింది. ఆ తర్వాత భారత్ పాక్‌పై దాడి చేసినట్లు ఇప్పటి వరకు సమాచారం అందుతోంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో పలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాటిలో 90 శాతం ఫేక్ వీడియోలు, ఏఐ జనరేటెడ్ వీడియోలు అంటూ కొంతమంది ఫ్యాక్ట్ చేసి నిరూపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. ఫేక్ వీడియోలతో పాటు, పాకిస్థాన్ దాడులను తిప్పికొడుతూ, పాక్‌పై దాడి చేస్తున్న సాయుధ దళాల గురించి కూడా రోహిత్ ఎక్స్ వేదికగా స్పందించాడు. “గడిచే ప్రతి క్షణం, తీసుకునే ప్రతి నిర్ణయంతో నేను మన భారత సైన్యం, భారత వైమానిక దళం, భారత నావికాదళం పట్ల చాలా గర్వంగా ఉన్నాను. మన యోధులు మన దేశ గౌరవానికి అండగా నిలుస్తున్నారు. ప్రతి భారతీయుడు బాధ్యతాయుతంగా ఉండటం, నకిలీ వార్తలను వ్యాప్తి చేయకుండా లేదా నమ్మకుండా ఉండటం ముఖ్యం. అందరూ సురక్షితంగా ఉండండి!” అంటూ ట్వీట్ చేశాడు.

# పాకిస్తాన్ సూపర్ లీగ్‌పై నీలి నీడలు

తొలిఅడుగు, పాకిస్తాన్ సూపర్ లీగ్(పిఎస్-ఎల్)పై నీలినీడలు కమ్ముకున్నాయి. బుధవారం అర్ధరాత్రి రావల్పిండి క్రికెట్ స్టేడియం సమీపంలో డ్రోన్ అటాక్ జరిగినట్లు సమాచారం. ఇక్కడే గురువారం రాత్రి పాకిస్తాన్ సూపర్ లీగ్ మ్యాచ్ జరగాల్సి ఉంది. బాబర్ ఆజం కెప్టెన్సీలోని పెషావర్ జల్మీ- డేవిడ్ వార్నర్ సారథ్యంలోని కరాచీ కింగ్స్ మధ్య మ్యాచ్ నిర్వహించేందుకు పాక్ క్రికెట్ బోర్డు షెడ్యూల్ ఖరారు చేసింది. అయితే, స్టేడియానికి దగ్గర్లోనే డ్రోన్ దాడి జరగడంతో అప్రమత్తమైన పాక్ బోర్డు.. క్రికెటర్లు రావల్పిండి విడిచి వెళ్లిపోవాలని ఆదేశించినట్లు సమాచారం. అలాగే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, జింబాబ్వే తదితర దేశాలకు చెందిన పలువురు క్రికెటర్లు ఈ లీగ్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు.. భారత్-పాక్ పరస్పర దాడుల నేపథ్యంలో తమ పౌరులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అమెరికా చెప్పడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలాంటి సమయంలో పాకిస్తాన్ ప్రిమియర్ లీగ్ షెడ్యూల్ ప్రకారం సాగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.




# ఐపిఎల్‌ను నిరవధిక వాయిదా: బిసిసిఐ



తొలిఅడుగు, భారత్-పాక్ యుద్ధ ఉద్రిక్తతల వేళ... ఐపిఎల్‌ను బిసిసిఐ నిరవధిక వాయిదా వేసింది. భద్రతా కారణాల దృష్ట్యా గురువారం ధర్మశాలలో జరిగిన పంజాబ్, ఢిల్లీ మ్యాచ్‌ను మధ్యలోనే నిలిపివేసిన సంగతి తెలిసిందే. పొరపాటున ఏ మిసైల్ లేదా డ్రోన్ దాడి స్టేడియంలో పడితే.. వేలల్లో ప్రేక్షకులు, పదుల సంఖ్యలోని విదేశీ, భారత క్రికెటర్లకు జరిగే ప్రాణనష్టం ఊహకందదంటూ.. నెటిజన్లు సోషల్ ప్లాట్ ఫాంపై అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపిఎల్‌ను రద్దు చేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఉన్నతాధికారులు భావించారు. వినోదం కంటే కూడా దేశ రక్షణ, ఆటగాళ్ల భద్రతే తమకు ప్రధానమని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అందుబాటులో ఉన్న బిసిసిఐ ఉన్నతాధికారులతో నేడు సమావేశమై ఐపిఎల్ పై తుది నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఐపిఎల్ రద్దు లేదంటే వాయిదా ప్రకటన వెలువడుతుందని బిసిసిఐ వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో.. ఐపిఎల్‌ను నిరవధిక వాయిదా వేసినట్లు బిసిసిఐ ప్రకటించింది. ఐపిఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులపై సమీక్షిస్తున్నామన్నారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత ఇంకా కొనసాగుతూనే ఉందని చెప్పారు. ఐపిఎల్ మ్యాచ్‌ల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాల్ని పాటిస్తామన్నారు. ఇప్పటివరకైతే కేంద్రం నుంచి తమకెలాంటి సూచనలు రాలేదని తెలిపారు. ఆటగాళ్ల భద్రత, రవాణా తదితర పరిస్థితుల్ని సమీక్షించాకే తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. లక్నోలో శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు ఏ ఇబ్బందులు లేవు కాబట్టి మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరిగే అవకాశాలే ఉన్నాయని తెలిపారు. ఐపిఎల్ లో నేడు లక్నో వేదికగా ఈరోజు రాత్రి 7 గంటల 30 నిముషాలకు లక్నో వర్సెస్ బెంగళూరు మ్యాచ్ జరగాల్సి ఉంది.